ఉపయుక్తం కాని కేంద్రాలు

- పదేళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం
- నరిపోని రూ.12 లక్షల అంచనా వ్యయం
- నిధులు కొరతతో చివరి దశలో నిలిచిన పనులు
- ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు భవనాలు
- ప్రజా ధనం వృథా.. పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం..


గుండ్లపాడులో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

వెల్దుర్తి: పల్నాటి సీమలోని మండలంలో పేద ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆరు ఆరోగ్య ఉప కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్క ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి రూ.12 లక్షల నిధులను మంజూరు చేసింది. 2014లో మండలంలోని గుండ్లపాడు, వెల్దుర్తి, బోదిలవీడు, కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డి గూడెంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు పునఃప్రారంభించి, రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, నిధులు సరిపోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు.. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు గ్రామంలోని సెంటర్‌లలో ఉండి రోగులకు వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. ప్రాథమిక, ఆరోగ్య ఉప కేంద్రాలు పూర్తయితే.. గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం సక్రమంగా అందించాలంటే అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలకు నిధులు మంజూరు చేసి, మిగిలిన పనులను పూర్తి చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

నిధులిచ్చి పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలకు నిధులు మంజూరు చేయాలి. పనులు పూర్తి చేస్తే ఏఎన్ఎంలు వైద్యం అందించేందుకు సౌకర్యంగా ఉంటుంది. అరకొరగా ఉన్న ఉప కేంద్రాల్లో పనిచేయడానికి సిబ్బందికి ఇబ్బంది ఉంది.

– డాక్టర్ శ్రీరామ్, వైద్యుడు, ఉప్పలపాడు పీహెచ్‌సీ

నిర్మాణాలు త్వరగా చేపట్టాలి



అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. గ్రామాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి సౌకర్యంగా ఉండాలంటే నిర్మాణాలను వెంటనే చేపట్టాలి. ప్రజలకు వైద్య సేవలను సకాలంలో అందించాలి.

– మండ్లి పెదమల్లుస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు

శిథిలావస్థలో భవనాలు



అసంపూర్తిగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను వెంటనే పూర్తి చేయకపోతే శిథిలావస్థకు చేరుకునే అవకాశముంది. పదేళ్ల కిందట మొదలు పెట్టిన నిర్మాణాలు చెట్లు మొలిచి నిరుపయోగంగా ఉన్నాయి. వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– గార్లపాటి వెంకట్రామయ్య, రచ్చమల్లపాడు

క్లుప్తంగా

పోరుబాటను జయప్రదం చేయాలి
గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా శుక్రవారం గురజాల పట్టణంలో తలపెట్టిన కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పిలుపునిచ్చారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, ప్రజల్ని మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో పోరుబాట చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిరసనను విజయవంతం చేయండి

గురజాల: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలు బోరుమంటున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. ఆయన తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బయలుదేరి ఏడీఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం, కార్యాలయం ఎదుట నిరసన తెలపడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

దాచేపల్లి: శ్రీనగర్ గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రెండు చర్చిల్లో క్రిస్మస్ కేక్‌లను కట్ చేశారు. అనంతరం 150 కుటుంబాలకు స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి జీవితాలు సంతోషంగా ఉండాలని సర్పంచ్ కూసం నాగిరెడ్డి అన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన పులిపాంగు చిన్న సాగర్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని సర్పంచ్ నాగిరెడ్డి భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, సుమతీ, శంకర్‌రెడ్డి, రాజేష్, సైదులు, పెద సాగర్, శ్రీనివాసరెడ్డి, సైదులు, మహేంద్ర పాల్గొన్నారు.

చర్చికి డెకరేషన్ లైట్ బహూకరణ



దాచేపల్లి: కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చికి ఇరికేపల్లి పంచాయతీ కార్యదర్శి, ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు నాగెండ్ల రత్నం రూ.35 వేలు విలువైన డేకరేషన్ లైట్‌ని బహూకరించారు. గురువారం సంఘ కాపరి జీఎస్. ప్రసన్నకుమార్ ప్రత్యేక ప్రార్థన చేసి, ఈ లైట్‌ని ప్రారంభించారు. దాత రత్నంని సంఘస్థులు సన్మానించారు. వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య, ఎంపీటీసీ ఏసుదాసు, సర్పంచ్ మీసాల బాబు, కోటేశ్వరరావు, సుధీర్‌కుమార్, మాణిక్యరావు, అంకయ్య, ప్రసాద్, పెద జాను పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్‌ వద్దనున్న షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు గోపాల్ పాండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సాయినాథునికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. భక్తులకు అన్న సంతర్పణం చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పిడుగురాళ్ల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కరాలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. అందరి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని అన్నారు. గ్రామ సర్పంచ్ చల్లా శివారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


ధ్రువ పత్రం అందజేస్తున్న తహసీల్దార్ బాషా



కొత్తపల్లి సభలో పాల్గొన్న తహసీల్దార్ వాణి

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల, మర్సపెంట గ్రామ సచివాలయాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. రైతులు తమ భూ సమస్యలను ఉచితంగా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ బాషా సూచించారు. గ్రామ సభలో ఆరు అర్జీలు వచ్చాయన్నారు. సీనియర్ అసిస్టెంట్ వలి, వీఆర్ఓలు యలమంద, వలి, టీడీపీ మండలాధ్యక్షుడు రాజబోయిన మధు, మూడావత్ వజ్రం నాయక్, రావుల కొండలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20 అర్జీలు స్వీకరణ

మాచర్ల రూరల్: మండలంలోని చింతలతండ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ బత్తుల వాణి పాల్గొని అర్జీలు స్వీకరించారు. అడంగల్‌లో పేరు మార్పు, పట్టాదారు పాసు పుస్తకాలు, పింఛన్, రేషన్ కార్డుల కోసం 20 అర్జీలు అందినట్లు తెలిపారు. దేవదాయ శాఖాధికారి సాంబశివరావు, ఆర్‌ఐ భాస్కర్, వీఆర్‌ఓ, కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన రాజీలేని పోరాటం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల


ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

దాచేపల్లి: అధికారం లేకపోయినా వందేళ్లు నిలబడిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ శత వసంతల వార్షికోత్సవ సభ నారాయణపురంలో గురువారం నిర్వహించారు. దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభించి నారాయణపురంలోని మదంపాటి నాగిరెడ్డి కల్యాణ మండపం వరకు నిర్వహించారు. కల్యాణ మండపంలో నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాగేశ్వరరావు పాల్గొని, మాట్లాడారు. ప్రజల సమస్యలను ఎజండా చేసుకుని సీపీఐ పని చేస్తోందన్నారు. ఈ పార్టీ కర్షకులు, కార్మికులు, సామాన్య ప్రజలదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కామ్రేడ్స్ మందపాటి అప్పమ్మ, షేక్ బుడేలతో పాటుగా పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన మరో 24 మందిని మెమెంటోలతో సన్మానించారు. జిల్లా సహాయకార్యదర్శి షేక్ హుస్సేన్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కొలా స్వాతి, మాచర్ల కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి కొమెర వెంకట్రావ్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, బుర్రి రంగారెడ్డి, తంగెళ్ల శ్రీనివాసరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళులు


వంగవీటి చిత్రపటానికి జనసేన నేతల నివాళి


దుర్గిలో రంగా విగ్రహానికి నివాళులు


నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, నేతలు


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అశోక్‌కుమార్


రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

కారెంపూడి: వంగవీటి మోహన రంగా వర్ధంతి గురువారం జనసేన పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక సెంటర్‌లో వంగవీటి విగ్రహానికి కిల్లా కాశి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

ప్రజల హృదయాల్లో వీఎం రంగా

దుర్గి: చివరి శ్వాస వరకు ప్రజల కోసం తపించిన వ్యక్తి వంగవీటి మోహన రంగా అని పలువురు నాయకులు పేర్కొన్నారు. వంగ వీటి రంగా వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రంగా పేదల ఇళ్ల పట్టాల కోసం ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తున్న సమయంలో అసువులు బాసారన్నారు. కటకం రామారావు, పులి హరి, సూరే వెంకటేశ్వర్లు, తోటకూర వెంకట నరసయ్య, గోపాలు, ఉప్పు శ్రీను, వీరమూల శ్రీను, సిద్దు కొండలు, వెలిదండి గోపాలు పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళి

రెంటచింతల: మండల కేంద్రంలో గురువారం వంగవీటి మోహన రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కన్నెగంటి హనుమంతు సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభిమానులు రంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రాగిడి ప్రతాప్‌బాబు, కర్నాటి కోటయ్య, ఆవుల వెవకటేశ్వర్లు పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళి

పిడుగురాళ్ల: కరాలపాడు గ్రామంలో పల్నాడు హాస్పిటల్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లక్ష్మయ్య, కోటేశ్వరావు, మన్నెం శ్రీను, దమ్ము హనుమయ్య, చిన్నోడు, మణి, వెంకటేశ్వర్లు, బుట్టోడు, ఆంజినేయులు, సాంబశివరావు, సాంబయ్య, గురవయ్య, షేక్ ఆదాం, షైదా పాల్గొన్నారు.

వంగవీటి అందరివాడు

గురజాల రూరల్: వంగవీటి మోహన రంగా అందరివాడని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతరావు , మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కటకం అంకారావు, చలవాది నారాయణరావు, ఓబయ్య, బడిదెల శ్రీనివాసరావు తదితరులున్నారు.

జెట్టిపాలెంలో ఘనంగా సీపీఐ స్వర్ణోత్సవాలు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో సీపీఐ స్వర్ణోత్సవ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల సీపీఐ కార్యదర్శి కేతావత్ రంగనాయకులు పార్టీ జండాను ఆవిష్కరించి, మాట్లాడారు. భారత కమ్యునిస్టు పార్టీ(సీపీఐ)1925 సంవత్సరం లో ఆవిర్భవించిందని 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వాడవాడలా స్వర్ణోత్సవ సంబరాలను వైభవంగా చేపడుతు న్నట్లు తెలిపారు. జెట్టిపాలెం శాఖ కార్యదర్శి దేరంగుల శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, దేరంగుల శివకోటేశ్వరరావు, గురవయ్య, మాధవరావు, వీరాస్వామి, శ్రీను, యు.రాజు పాల్గొన్నారు.

స్వాములకు సద్ది వితరణ


దాత పేర్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న స్వాములు

రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో గురువారం వేద పండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో హోమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41వ రోజు రెంటచింతలకు గ్రామానికి చెందిన పేర్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అయ్యప్పస్వామి మండపంలో స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. స్థానిక శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి స్వామి, కట్టమూరి శ్రీనివాస రావు గురుస్వామి, బరువు శివారెడ్డి, కె.సైదులు స్వామి, గుండా రాము ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయపురిసౌత్: బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మాచర్ల మండలం చింతల తండాలో అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ప్రతిజ్ఞ నిర్వహించారు. బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ ధ్యేయమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు శారదా, మహాలక్ష్మి, రూపదేవి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారికి ధనుర్మాస పూజలు


వడ్డవల్లిలో నిజరూప దర్శనంలో శ్రీవారు


నిఖిల లోకేశ అలంకారంలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాస ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో కనుల పండువగా శ్రీవారికి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ దేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తిరుమలలో స్వామివారి కైంకర్య ఆచారాన్ని అనుసరించి శ్రీవారికి నిజరూప దర్శనాన్ని భక్తులు గురువారం ఏర్పాటు చేశారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిఖిల లోకేశ అలంకారం శ్రీవారికి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలి

ఏడీఏ హనుమంతరావు


మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు, ఏఓ వేణుగోపాల్

క్రోసూరు: రైతు సేవా కేంద్రాల ద్వారా వరి కనీస మద్దతు ధర రూ.1,740కు కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ హనుమంతరావు తెలిపారు. మండలంలోని క్రోసూరు, అందుకూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో వరి 75 కిలోల బస్తా కనీస మద్దతు ధర రూ.1740 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనికి రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ధాన్యం విక్రయించుకునే రైతులకు పలు సూచనలు చేయటం జరిగింది. ఈ-పంట నమోదు చేసుకొని ఈ-కేవైసీ కూడా పూర్తి అయిన రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి అమ్ముకొనవచ్చునన్నారు. రైతులు ముందుగా ఒక కిలో ధాన్యాన్ని రైతు సేవా కేంద్ర కేంద్రానికి తీసుకువెళ్లి, అందులో తేమ.ఇతర నాణ్యత ప్రమాణాలను రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా పరీక్ష చేయించుకోవాలన్నారు. ధాన్యంలో తేమశాతం 17 కన్నా మించి ఉన్నట్లయితే, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 శాతం కన్నా తక్కువ వచ్చిన తర్వాత తిరిగి తీసుకురావాలన్నారు. రైతులు గోనె సంచులు, హమాలీలు ఖర్చు, రవాణా వారి సొంతంగా ఏర్పాటు చేసుకుంటే, ప్రభుత్వ లెక్కల ప్రకారం అనగా 40 కిలోల ఒక గోనె సంచికి ఒకటికి రూ.3.39 క్వింటాలుకు హమాలీ చార్జీ రూ.17.17 ,రవాణా చార్జీలు స్థానికంగా నిర్ణయించిన రేట్ల ప్రకారం ధాన్యం సొమ్ముతో కలిపి ఆధార్ నెంబర్‌కు అనుసంధానిత రైతు ఖాతాలోకి నేరుగా చెల్లించడం జరుగుతుందన్నారు.

వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లుకోవాలి



మాచవరం: వర్షాలకు తడిచిన వరి పనలను తిరగ వేసి ఆరబెట్టుకోవాలని, మొలకలు వచ్చేట్లు ఉంటే 5 శాతం ఉప్పు ద్రావణం పనలపై పిచికారి చేయాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంట నమోదు చేసుకున్న రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సమాయకులు అన్వర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌కు మరమ్మతులు



బెల్లంకొండ: మండల పరిధిలోని బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ కాలువపై మరమ్మతులు ప్రారంభించినట్లు ఎస్‌ఎస్పీ జేఈ ఇబ్రహీం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బ్రాంచ్ కాలువపై నడవడానికి కూడా వీలు లేకుండా ఉండడంతో బెల్లంకొండ డీసీ-7 చైర్మన్ అంచుల శివలక్ష్మి, మాజీ చైర్మన్ అంచుల బాల సైదులు సొంత నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. బెల్లంకొండ, రాజుపాలెం మండలాల పరిధిలోని కాలువపై, దమ్ము ట్రాక్టర్ల సహాయంతో ముళ్ల చెట్లు తొలగించుట, కాలువలో నాచు తొలగించే పనులు చేపట్టారు.

రాజుపాలెం పోలీస్ స్టేషన్ తనిఖీ


పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం: శాంతిభద్రతల విషయంలో ఎవ్వరిని ఉపేక్షించేది లేదని డీఎస్పీ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వార్షిక తనిఖీలు గురువారం నిర్వహించారు. ఈ సంవత్సరానికి సంబంధించిన రికార్డులను, పెండింగ్ కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచనలను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరితో స్నేహభావం కలిగి ఉంటారని, అలాగని తప్పులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ పవరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్ఐ వేణుగోపాల్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కారెంపూడి: వాసవి సేవా సమితి సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సమాఖ్య ప్రతినిధులు ఆవిష్కరించారు. అధ్యక్షుడు గరికె పుల్లారావు, ప్రధాన కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, వాసవి అమ్మవారి దేవాలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

నకరికల్లు: రబీలో సాగు చేస్తున్న పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం ఎకరాకు రూ.630 చొప్పున ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్ తండా గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం.ప్రశాంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.సంధ్యారాణి, వీఆర్వో షేక్ సైదా, ఇన్సూరెన్స్ సంస్థ క్లస్టర్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.